క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గిరి ప్రదక్షిణ జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

27న ఉక్కునగరం క్లబ్ ఎన్నికలు

ఉక్కునగరం: ఉక్కునగరం క్లబ్ పాలకవర్గం ఎన్నికలు ఈ నెల 27న నిర్వహించనున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.వి.రావు తెలిపారు. ప్రస్తుత పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారితో పాటు గ్రూప్–1 నుంచి నలుగురు, గ్రూప్–2 నుంచి ముగ్గురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారన్నారు. ఈ నెల 10 నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. 18వ తేదీ రాత్రి 9 లోగా నామినేషన్ల దరఖాస్తు గడువుగా, 20న నామినేషన్ల ఉపసంహరణ గడువుగా నిర్ణయించామన్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం



బూత్ కమిటీల వివరాలను పరిశీలిస్తున్న నర్సింగరావు

పెదగంట్యాడ: భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 75వ వార్డులో బూత్ స్వశక్తి కరణ్ కార్యక్రమంలో భాగంగా బూత్ కమిటీలను శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీకైనా బూత్ కమిటీలు ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కిల్లాన ముసలయ్య, జీలకర్ర భువనేశ్వరి, వానపల్లి సూర్యచంద్రరావు, రాజేశ్వరి, కన్నారావు, పూతి అప్పలరెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

ఎల్లేటి రామారావు సేవలు మరువలేం



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ప్రజల పక్షాన నిలిచి, నిరంతరం సమస్యలపై పోరాటాలు చేసిన ఎల్లేటి రామారావు సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో ఎల్లేటి రామారావు 18వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామారావు, మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1200 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం నేడు

అగనంపూడి: విజ్ఞాన్ ఇంజినీరింగ్, మహిళా ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుకుని, ఉద్యోగాలు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం సాయంత్రం ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నట్టు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్స్ జె.సుధాకర్, బి.అరుంధతి తెలిపారు. దువ్వాడ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎంపికైన 8 వందల మంది విద్యార్థులు, మహిళా ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎంపికైన 4వందల మంది విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించనున్నట్టు తెలియజేశారు.



మురుగు సమస్యకు ఇక చెక్

- ఆటోనగర్ డీ బ్లాక్ విస్తరణలో చురుగ్గా డ్రైనేజీ నిర్మాణం



రోడ్డు పక్కన పేరుకుపోయిన మురుగు (ఫైల్)



ఆటోనగర్ డీ బ్లాక్ వద్ద నిర్మిస్తున్న డ్రైనేజీ

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ డీ ఎక్స్‌పెన్షన్ పాత ఆర్టీవో కార్యాలయం రోడ్డులో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. నీరు నిల్వ ఉండకుండా 500 మీటర్ల మేర డ్రైనేజీ నిర్మిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇదీ పరిస్థితి

పాత ఆర్‌టీవో కార్యాలయం రోడ్డులో మురుగు పేరుకుపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనచోదకులు నరకం చూసేవారు. ఆటోనగర్ డీ ఎక్స్‌పెన్షన్ పక్కనే ఉన్న విశ్వేశ్వరాయ నగర్‌కు ప్రత్యేకంగా మురుగు కాలువలు లేకపోవడంతో, అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే మురుగు నీరు ఈ బ్లాక్‌లోకి వచ్చి రోడ్డు పక్కన నిల్వ ఉండిపోయి ఈ పరిస్థితి నెలకొంది. తరచూ మురుగు రోడ్డుపైకి వచ్చి చేరడంతో కంపెనీలకు, విధులకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు ఇబ్బంది పడేవారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరీ ఘోరం. ఏకంగా అడుగులోతు మురుగు రోడ్డుపై నిలిచిపోయేది. ఆ మురుగులోనే వాహనచోదకులు, పాదచారులు ప్రయాణించాల్సి వచ్చేది. దీంతో ఐలా కార్యవర్గం సమస్య పరిష్కారంపై దృష్టి సారించింది.

రూ.40 లక్షలతో రోడ్లు, కాల్వల అభివృద్ధి

ఆటోనగర్ ఐలా డీ – ఎక్స్‌పెన్షన్‌లో సీసీ కాలువలు, రోడ్ల అభివృద్ధికి ఐలా రూ.40 లక్షలు కేటాయించింది. టెండర్లు పిలిచి సుమారు 500 మీటర్ల కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలువ ద్వారా మురుగు నీరు సెఫ్ ఎక్స్‌ప్రెస్ పక్క నుంచి గాజువాక 100 అడుగుల రోడ్డు పక్కనున్న కల్వర్టులో అవుట్ లెట్ ద్వారా కలిసేలా నిర్మిస్తుండడంతో మురుగు సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది.



500 మీటర్ల మేర నిర్మించిన మురుగు కాలువ

పనులు 80శాతం పూర్తి



డీ ఎక్స్‌పెన్షన్‌లో మురుగు నీటి వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉండేది. ఐలా డీ –ఎక్స్‌పెన్షన్ అభివృద్ధికి కేటాయించిన నిధులతో కాలువను నిర్మిస్తున్నాం. పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికి 80శాతం పూర్తయ్యాయి.

– జి.అశోక్ రాజు
డీ – బ్లాక్ ఎక్స్‌పెన్షన్ మెంబర్

అన్ని బ్లాకులు పూర్తి స్థాయిలో అభివృద్ధి



ఆటోనగర్‌లో అన్ని బ్లాకుల అభివృద్ధికి మెంబర్లు, పారిశ్రామిక వేత్తల సహకారం తీసుకుంటున్నాం. బీ బ్లాక్‌లో పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మించాం. పలు బ్లాకుల్లో ఇప్పటికే పనులు జరుగుతున్నాయి.

– కె.సత్యనారాయణ రెడ్డి(రఘు),
ఐలా చైర్మన్

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్‌లో వేంచేసియున్న సంపత్ వినాయక ఆలయ 40వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ధ్వజస్తంభానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పూజలు చేశారు. కలశ ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు, నీలాపు రెడ్డి, ఆరిపాక సంతోష్, రావాడ అప్పలరాజు, సాంబమూర్తి, దుర్గారావు, సీకు రమణ, పవన్‌కుమార్, పెంటకోట నాగేశ్వరరావు, బాలమణి పాల్గొన్నారు.



ధ్వజస్తంభ పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ వంశీరెడ్డి

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: 11కేవీ ఇండస్ట్రియల్ ఏరియా ఫీడర్ పరిధిలోని నిర్వహణ పనులు (పాడైన ఏబీ స్విచెస్ రీప్లేస్‌మెంట్ వర్క్) నేపథ్యంలో ఈ నెల 7న సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఏరియాలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు



బుద్ధుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్టాలిన్, తదితరులు



జయంత్యుత్సవాల్లో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీవీఓ డాక్టర్ కరుణ రాజు

పెదగంట్యాడ: బుద్ధుని బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం చైర్మన్ బోర వేణుగోపాల్ గౌతమ్ ఆధ్వర్యంలో బర్మా కాలనీలో శుక్రవారం బుద్ధ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నాగిరెడ్డితో పాటు మయన్మార్ బౌద్ధ భిక్షువు ఆయుపాల మహథేరో హాజరై బుద్ధుని బోధనలను వివరించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెయ్యిల సిద్ధార్థ, కొరమాటి అన్నవరం, బోర జగన్నాథరావు, బోర లోకేశ్వరరావు, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

గాజువాక : బుద్ధుని బోధనలు అన్ని వర్గాల ప్రజలకు అనుసరణీయమని 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ అన్నారు. స్థానిక చైతన్యనగర్‌లోని గౌతమ బుద్ధ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన బుద్ధ పూర్ణిమ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. బుద్ధుని బోధనలు మానవాళికి ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.వి. సుబ్బారావు, దాసరి సుధాకర్, జె.వెంకటేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, బాపయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బుద్ధవిహార్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బౌద్ధ మిషన్ ఆధ్వర్యంలో ఉక్కునగరం బుద్ధ విహార్‌లో ఉత్సవాలను స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ సిర్రా కరుణ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బుద్ధుడు అన్ని మతాలకు చెందిన వారన్నారు. బుద్ధ విహార్‌లో ధ్యానం చేయడం ఆరోగ్యకరమన్నారు. ప్రముఖ రచయిత, ఏయూ పూర్వ డిప్యూటీ రిజిస్ట్రార్ నటరాజ్ బుద్ధుని గురించి కీలక ఉపన్యాసం చేశారు. స్టీల్‌ప్లాంట్ క్యూఏటీడీ విభాగాధిపతి టి.ఎస్. ధ్రూ, ట్రాఫిక్ విభాగాధిపతి డి. విజయకుమార్, ఎల్.ఎం.ఎం విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్. ప్రసాద్, బుద్ధుని సిద్ధాంతాల గురించి వివరించారు. బౌద్ధ మిషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. కపార్దే, ప్రధానకార్యదర్శి పరమట సత్యనారాయణ ప్రసంగించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. బౌద్ధ మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సిద్ధార్థ నగర్‌లో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు సిద్ధార్థ నగర్‌లో బుద్ధపూర్ణిమ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి సత్రం నాగేశ్వరరావు, మాటూరి శ్రీనివాసరావు, సర్వేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై, బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, జె.ఎస్. మూర్తి, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు

దాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. బుద్ధ, వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ పర్యవేక్షించారు. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు కల్పించారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభ పూజలు జరిగాయి.



రమా సహిత సత్యనారాయణ స్వామి

ఆయన నేత్రాలు సజీవం



నేత్రాలను దానం చేసిన అప్పన్న (ఫైల్)

పద్మనాభం: శేరిఖండం గ్రామానికి చెందిన పుప్పాల అప్పన్నబాబు (83) మరణాంతరం తన నేత్రాలను దానం చేశారు. తాను మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయాలని ఆయన కుటుంబ సభ్యులకు చెప్పాడు. గురువారం అప్పన్నబాబు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నం ఎల్‌వీప్రసాద్ ఐ బ్యాంకు వారు గురువారం రాత్రి శేరిఖండం వచ్చి నేత్రాలను తీసుకువెళ్లారు. మృతుడు అప్పన్నబాబుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని శారద

సీతంపేట: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లలితానగర్ లలితా పీఠంలో కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. వీరగంట లలితా చంద్రశేఖర్ శిష్యురాలు కొంపెల్ల లక్ష్మి శారద తన అద్భుత గాత్రంతో ప్రేక్షకులను అలరించారు. నీవే నన్ను, శ్రీవిఘ్న రాజం భజే, గౌరీ సుకుమారి, శ్రీకమలాంబికే, పామర జనపాలిని, మంగళదాయిని వంటి ముత్తుస్వామి దీక్షితార్, బాల సుబ్రహ్మణ్యం ఆలపించిన పలు గీతాలను పాడి భక్తులను ఆకట్టుకున్నారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు.

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి శుక్రవారం అడవివరానికి చెందిన కశిరెడ్డి కాశీవిశ్వనాథం అనే దాత లక్ష 116 రూపాయిలు విరాళం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు అన్నదాన భవనంలో ఏఈవో నరసింహరాజు బాండ్ ఇచ్చారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ నరసింగరావు పాల్గొన్నారు.

పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బొర్రమాంబ ఉప్పరకాలనీ, అగనంపూడి ఎస్సీ కాలనీల్లో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.20లక్షలతో పైప్‌లైన్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇది పూర్తయితే దీర్ఘకాలంగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఎస్సీ కాలనీ, ఉప్పర కాలనీ ప్రజల ఇబ్బందులు తీరనున్నాయన్నారు. నియోజకవర్గ పరిధిలో రహదారులు, మంచినీటి సమస్య పరిష్కారంతో పాటు పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 40వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు, పిళ్లా కొండలరావు, దాసరి సత్యవేణి, యలమంచిలి అప్పారావు, పెదిరెడ్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ ప్రమాదంలో నుజ్జయిన కారు



ప్రమాదంలో నుజ్జయిన కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో కారు నుజ్జయింది. అదృష్టవశాత్తు కారులో ఎవరికీ, ఎటువంటి గాయాలు కాలేదు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. శుక్రవారం ఉదయం టౌన్‌షిప్‌కు చెందిన వై. కిరణ్ సాయి చంద్ కారులో హిల్‌టాప్ సమీపంలోని పెట్రోల్ బంక్ మార్గంలో వెళ్తున్నాడు. పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి కుక్క అడ్డు వచ్చింది. దీంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారు వేగానికి రోడ్డు పక్కన ఉన్న చెట్టు విరిగి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయింది. ప్రమాదంలో కిరణ్ సాయిచంద్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు

భెల్ బీఎంఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



బీఎంఎస్ నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో బీఎంఎస్ విశాఖ యూనిట్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. తిరుచ్చికి చెందిన భెల్ యూనిట్ల సెంట్రల్ లీడర్ అంగు స్వామి ఆధ్వర్యంలో సంస్థలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ముందుగా సమస్యలపై చర్చించారు. అనంతరం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఐ.ముత్యాలును, సలహాదారుగా అంగు స్వామిని, అధ్యక్షుడిగా బ్రహ్మానంద పుష్టిని, ప్రధాన కార్యదర్శిగా రమేష్ కుమార్‌ను, 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సమావేశంలో బీఎంఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి నరేంద్ర, తమిళనాడు పీఎఫ్ స్టేట్ బోర్డు మెంబర్, తిరుచ్చి భెల్ ప్రధాన కార్యదర్శి శంకర్, ప్రతినిధి చందన్ కుమార్ పాల్గొన్నారు.

చినగంట్యాడ రైతులకు న్యాయం చేయాలని వినతి



ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రామారావు తదితరులు

గాజువాక : ఏపీఐఐసీ కోసం భూములు కోల్పోయిన చినగంట్యాడ రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు కోరారు. ఈ మేరకు రైతులతో కలిసి ఎమ్మెల్యే నాగిరెడ్డిని కలిసి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో రైతులకు స్థలాలు కేటాయించడం కోసం సర్వే నిర్వహిస్తున్నారని, ఆ జాబితాలో చినగంట్యాడ రైతుల పేర్లు లేవని పేర్కొన్నారు. దీనిపై స్పందించి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గ్రామ నాయకుడు కుంచా వీరినాయుడు తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పర్యటన



డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని విక్రయదారుడికి సూచిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

కంచరపాలెం: బహిరంగ ప్రదేశాలు, రహదారుల వెంబడి చెత్తాచెదారం, చెట్ల కొమ్మలు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సూచించారు. 54వ వార్డు 104 ఏరియా, కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని వాకింగ్ ట్రాక్ ప్రాంతాల్లో వాకర్స్‌తో మాట్లాడారు. రాగిజావ విక్రయిస్తున్న ఓ వ్యాపారి ప్లాస్టిక్ గ్లాసులు వాడటం, రోడ్లపై అవి పడి ఉండటం చూసి మండిపడ్డారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకూడదని, డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని విక్రయదారులకు సూచించారు. అనంతరం త్రీస్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులపై కమిషనర్ ఆగ్రహించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో శానిటరీ సిబ్బందిని నియమించి ప్రతి రోజు ఉదయం రోడ్లను శుభ్రం చేయించాలని పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోన్–5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ ఎస్.జనార్దన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం



పతాకాన్ని ఎగరవేస్తున్న ఫాదర్ సరసా ప్రతాప్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చిలో శుక్రవారం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం, క్రీస్తు రక్షకుని యాత్రా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఫాదర్ సరసా ప్రతాప్ పతాకావిష్కరణ చేశారు. జపమాల, దివ్యబలి పూజలు నిర్వహించారు. అనంతరం నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. స్వస్థత ప్రార్థన కూటమి ప్రార్థనలు చేశారు. పుర:ప్రదక్షిణ, బైబిల్ పదకేళి పోటీలు నిర్వహించారు. 9 రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు మే 14న బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో రక్షణగిరి పత్రిక సంపాదకులు ఆదిరెడ్డి ఆల్బర్ట్, పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) సభ్యులు ఆమర్, ఆదిరెడ్డి చార్లీ, ఆనందరావు, బేతా రాణిజోసెఫ్, గురు మండలి సలహా సంఘం సభ్యులు, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

